ఆధ్యాత్మికం



ఉత్సవాలకు ముస్తాబు అయిన ముంగిమడుగు ముత్యాలమ్మతల్లి ఆలయం (ఇన్‌సెట్)లో అమ్మవారి ప్రతిమ

రేపు ముత్యాలమ్మ జాతర

- ముంగిమడుగుకు భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీ నిర్వాహకులు

నర్సింహులపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగుబంగారం ముత్యాలమ్మ తల్లి జాతర గురువారం నుంచి ప్రారంభం కానుంది. నర్సింహులపేట మండలంలోని ముంగిమడుగు గ్రామంలో ఏటా దీపావళి పర్వదినం రోజున అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా రేపు జరుగనున్న ముత్యాలమ్మ తల్లి జాతర ఉత్సవాలకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు, ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వెంకమ్మ చెరువుకు తీసుకెళ్లి స్నాన ఘట్టం నిర్వహించిన అనంతరం డప్పుచప్పుళ్లతో గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం ఆలయం పూజారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని ఆలయంలో పునర్ ప్రతిష్ఠిస్తారు. చిన్నాపెద్ద తేడా లేకుండా అమ్మవారికి మొక్కులు సమర్పిస్తారు. సాయంత్రం సమయంలో ప్రతీ ఇంటి నుంచి బోనాలతో మహిళలు తరలివచ్చి అమ్మవారి నేవేధ్యం సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. ఈ ఉత్సవాలకు మండలంలోని రామన్నగూడెం, కౌసల్యదేవిపల్లి, నర్సింహులపేట, పెద్దనాగారం, చిన్నగూడూరు, నెల్లికుదురు, మహబూబాబాద్, మరిపెడ, దంతాలపల్లి, కేసముద్రం, తొర్రూరు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నారు. మాతృ యూత్ అసోసియేషన్ సభ్యులు, గౌడ సంఘం నాయకులు ఏర్పాట్లు సమీకరణ చేస్తున్నారు.



ముందే.. పేలుతున్నాయ్!

ఆకాశాన్నంటుతున్న టపాసుల ధరలు

- జిల్లా వ్యాప్తంగా 46 బాణసంచా దుకాణాల ఏర్పాటు
- శివకాశి నుంచి సరుకు దిగుమతి

మహబూబాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దీపావళి అంటేనే టపాసుల పండుగ. పిల్లలు మొదలుకుని పెద్దల వరకు అందరూ ఈ టపాసులను కాల్చి పండుగను జరుపుకొంటారు. కళ్లు మిరమిట్లు గొలిపే రంగుల కాంతులను వెదజల్లే కాకరవత్తులు, చిచ్చుబుడ్లే కాదు మోతమోగించే మతాబులను కొనుగోలు చేస్తుంటారు. కానీ ఏటేటా పెరుగుతున్న ధరలతో జనం బెంబేలెత్తుతున్నారు. ఈ ఏడాది కూడా 'అంటించకుండానే 'పేలుతున్నాయి' అనే రీతిలో ధరలున్నాయి. తారాజువ్వాల్లా ఆకాశంలోకి దూసుకుపోతున్న మతాబుల ధరల నియంత్రణ ఎందుకు జరగడం లేదో కానీ, కొనే వారికి జేబులు తడుముకునే పరిస్థితి వస్తే అమ్ముకునే వారికి మాత్రం కాసులు కురిపించే పండుగ కూడా ఇదేనని చెప్పకతప్పదు. ఆయామతాబుల బాక్సులపై ముద్రించిన ఎమ్మార్పీ ధరలు చూస్తే కళ్లు భూ చక్రాల్లా గిర్రున తిరుగక మానదు. వ్యాపారులు తక్కువేం కాదు.. అసలు ధర ఇది అంటూ ఎమ్మార్పీని చూపి వినియోగదారులను బోల్తా కొట్టిస్తున్నారు.

చీకటి వెలుగుల రంగేళి..

చీకటి వెలుగుల రంగేళీ.. జీవితమే ఒక దీపావళి.. పాత పాటల తారాజువ్వలాగే.. దీపావళి. అమావాస్య నాటి కారుచీకటిని చీల్చుకుంటూ వెలుగులు విరజిమ్మే మతాబుల పండుగను ఎవరూ మర్చిపోరని చెప్పుకోవచ్చు. సినిమాలంటే కాస్తోకూస్తో పరిచయం ఉన్న వారి నుంచి మొదలుకొని నేటి తరం వరకు గుర్తుంచుకోగలిగిన దీపావళిని ప్రస్థావించే సాహిత్యం అంటూ ఒక్కటి ఉందంటే అది 'చీకటి వెలుగుల రంగేళి.. జీవితమే ఒక దీపావళి..!' అనే పాటే!! నేటికి ఆ పాత మధురంగా, శ్రావ్యమైన సంగీతంలో అందరిని ఆకట్టుకుంటుంది. చూడ డానికీ, వినడానికీ ఎంతో బాగుంటుంది. వాస్తవ జీవితంలోకి తొంగిచూస్తే రోజురోజుకు ఆకాశన్నంటున్న ధరల మోత సగటు మానవుల జీవితంలో వెలుతురును చిదిమేస్తూ చీకటిని కమ్మేస్తోంది. అందులోనూ పండుగలోస్తున్నాయంటే చాలు సగటు మానవుడు కుటుంబంలో ఆనందాలు నింపడానికి అప్పులు చేయక తప్పనిపరిస్థితి.

దీపావళి అంటే చిన్నపిల్లలకు రంగులు విరజిమ్మే టపాసులే ప్రాణం. వారి కళ్లల్లో మిరిమిట్లు గొలిపే సంబురాలు చూడడానికి ఏ తల్లిదండ్రి కూడ వెనుకాడని పరిస్థితి. ఇక అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు పిల్లల ఆనందాలను చూడ ముచ్చట కోసం మతాబులు కొనిస్తూ ఉంటారు.

శివకాశి నుంచి రాష్ట్రంలోకి..

శివకాశి నుంచి వివిధ రకాల బాణాసంచాలు తెలంగాణ రాష్ట్రంలోని తాడేపల్లిగూడెం, మంగళగిరి, గన్నవరం, రాజమండ్రి, సత్తుపల్లి, మధిర, వరంగల్, హైదరాబాద్, విజయవాడతో పాటు జనగామకు కూడా దిగుమతి అవుతుంటాయి. మహబూబాబాద్ జిల్లాకు చెందిన వ్యాపారులు శివకాశి వరకు వెళ్లరు. తమకు అనుకూలంగా ఉన్న సమీప ప్రాంతాల నుంచి వాటిని కొనుగోలు చేసుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసే లైసెన్స్‌డ్ దీపావళి టపాసుల దుకాణాలకు చేరుస్తారు. ఇక్కడి నుంచి గ్రామీణ ప్రాంతాలకు హోల్‌సేల్‌గా, రిటైల్‌గా క్రయవిక్రయాలు కొనసాగుతాయి. ఇలా దూర ప్రాంతాల నుంచి రవాణా రూపంలో గ్రామీణ ప్రాంతం చేరుకునే వరకు ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చి సామాన్యుడి చేతికి చేరేవరకు అవి అంటించకుండానే పేలిపోతుంటాయి.

మానుకోటలో 17 షాపులు..

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అధికారికంగా 46 దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్క జిల్లా కేంద్రంలోనే 17 దుకాణాలను ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేశారు. తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మునిసిపాలిటీ కేంద్రాలతో పాటు బయ్యారం, గూడూరు, కొత్తగూడ, తదితర మండల కేంద్రాలు దరఖాస్తులకు అనుగుణంగా అనుమతులు ఇచ్చారు. ఇక్కడ్నుంచి పెద్దపెద్ద గ్రామాలకు ముందుగానే కొనుగోలు చేసిన మతాబులను అనధికారికంగా విక్రయాల కోసం ఇప్పటికే తరలించారు. లైసెన్స్ దుకాణాల్లో ఉన్నరేటు కంటే మరింత పెంచి గ్రామాల్లో విక్రయాలు చేపట్టేందుకు వ్యాపారులు సన్నద్ధమయ్యారు.

గతేడాది కన్న 5 శాతం పెరిగిన రేట్లు..

టపాసుల ధరలు గతేడాది కంటే 5 శాతం పెరిగినట్లు వ్యాపార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. పది పీసుల టూసౌండ్, త్రీసౌండ్ ప్యాకెట్ ధర గతంలో రూ.350 ఉంటే ప్రస్తుతం రూ.370 నుంచి రూ.400 వరకు పెరిగింది. ఇదేరీతినస్మాల్, మీడియం సైజు రాకెట్ ధరలు 10 ప్యాకెట్ల బాక్సుకు రూ.20 కాగా, రాకెట్ సైజులను బట్టి, క్వాలీటీలను బట్టి రూ.50 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు.

భూ చక్రాలు కూడా ధరల చక్రం తిప్పేస్తున్నాయి. 25 పీసుల భూచక్రం ప్యాకెట్ ధర గతేడాది రూ.200 ఉంటే రూ. 230కి పెరిగింది. మీడియం ప్యాకెట్ ధర రూ.160 నుంచి రూ.180కి పెంచారు. పెద్దవి రూ.330 నుంచి రూ.360కి పెంచేశారు. క్రాకరీ ధరలూ ఇట్లాగే పెరిగాయి. సైజులను బట్టీ రూ.10 నుంచి రూ.15, రూ.30 నుంచి రూ.40, రూ.50 నుంచి 60, రూ.80 నుంచి రూ.100కు పెంచేశారు.

షాట్స్ అయితే ధరలు షాక్ కొడుతున్నాయి. టువెల్ షాట్స్ ధర రూ.270 నుంచి రూ.290కి, 15 షాట్స్ రూ.550 నుంచి రూ.600కి, 30 షాట్స్ రూ.800 నుంచి రూ. 850లకు, 60షాట్స్ రూ.1600 నుంచి రూ. 1800లకు, 120 షాట్స్ రూ.2300 నుంచి రూ. 2500 వరకు పెరిగాయి.

తాటాకులు 25 పీసుల ప్యాకెట్ ధర రూ.20 చొప్పున విక్రయి స్తున్నారు. ఇక తాళ్లు, పెన్సిల్, అగ్గిపెట్టేలతో పాటు ఫ్యాన్సీ ఐటమ్స్‌లలో కుండలు, జాయింట్స్, పాప్స్, ఫ్యాషన్, స్నోవైట్, టైపింగ్, డ్యాన్సర్ లాంటి బాణాసంచా రకాల ధరలు 20 నుంచి 30శాతానికి పెంచి అమ్ముతున్నారు. తౌజండ్‌వాల రూ.200, టుతౌజండ్ రూ.350, ఫైవ్‌తౌజండ్ రూ.800 చొప్పున విక్రయిస్తున్నారు.



మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

సమాచారం

మార్కెట్‌కు ఐదు రోజులు సెలవు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 30వ తేదీ నుంచి నవంబర్ 3 వరకు ఐదురోజుల పాటు దీపావళి, వారాంతపు సెలవులను ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి శంషీర్ మంగళవారం ప్రకటించారు. ఈనెల 30న నరక చతుర్థశి, 31 దీపావళి పండుగ, నవంబర్ 1న అమావాస్య, 2న వారాంతపు సెలవు, 3న ఆదివారం సెలవు సందర్భంగా మార్కెట్‌యార్డు సెలవు ఉంటుందని చెప్పారు. తిరిగి నవంబర్ 4న సోమవారం మార్కెట్ పునఃప్రారంభమవుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావొద్దన్నారు.



గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేస్తున్న చెన్నయ్య

క్రీడలతో మనసిక ఉల్లాసం

- అదనపు ఎస్పీ చెన్నయ్య

తొర్రూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయని జిల్లా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య అన్నారు. సోమవారం రాత్రి తొర్రూరులోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో గత వారం రోజులుగా నిర్వహించిన డివిజన్‌స్థాయి బ్యాట్మంటన్ క్రీడా పోటీల ముగింపు ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. పోలీస్ ఉద్యోగులు తప్పనిసరిగా బాడీ ఫిట్‌నెస్ కోసం వ్యాయామంతో పాటు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. క్రీడల్లో ప్రతిభకనబర్చిన తొర్రూరు సీఐ జగదీష్, ఎస్సైలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణకిషోర్, జగదీష్, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

'దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి'

- పురుగుల మందుతో ఠాణా ఎదుట బాధితుల ఆందోళన

చిన్నగూడూరు, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): తమపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుల మందుతో బాధిత కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కత్తిపోటుకు గురైన బాధితుడు, ఆయన కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. ఉగ్గంపల్లికి చెందిన బీసు రమేష్‌పై దసరా రోజున దాడి జరగగా, పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయకుండా జాప్యం చేస్తున్నారని, అతడికి కాకుండా గొడవతో సంబంధంలేని ఐదుగురిని రిమాండ్‌కు పంపారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎస్సై ఝాన్సీని వివరణ కోరగా.. దసరా రోజు జరిగిన ఘర్షణలో 15 మందిపై కేసు నమోదు చేశామని, ఇప్పటికే ఐదుగురిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మిగిలిన వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై వివరించారు.



ఆందోళన చేస్తున్న బాధితకుటుంబసభ్యులు

కుటుంబ సర్వేను విజయవంతంగా చేయాలి

- షెడ్యూల్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

మహబూబాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేను విజయవంతంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఖమ్మం జిల్లా మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి నవంబరు 6 నుంచి చేపట్టే సమగ్ర ఇంటింటి సర్వేపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్రకుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే) నిర్వహణ విధి విధానాలను క్యాబినెట్‌లో చర్చించి, ఆమోదించామన్నారు. ఇందులో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరిస్తామని వివరించారు. ప్రజా ప్రభుత్వం ఉన్నతమైన ఆలోచనతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చేపడుతుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యున్నతికి, వారిఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగు పర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ఈ సర్వేను ఉపయోగిస్తామని వివరించారు. ప్రతీ ఇంటి నుంచి వివరాలు సేకరించాలని, దానికి తగిన ప్రణాళికలు తయారు చేయాలన్నారు.

సర్వేకు అవసరమైన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించి వారికి అవసరమైన శిక్షణ అందించాలని భట్టివిక్రమార్క వివరించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారులను ఎంపిక చేయాలని, సీఆర్పీ, గెస్ట్ టీచర్ల సేవలు వినియోగించుకోవాలన్నారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ ఉండేలా ఈబీ మ్యాప్‌లను అప్‌డేట్ చేయాలన్నారు. ప్రతీ మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించాలని సూచించారు. సర్వే షెడ్యూల్ వివరాలు ప్రజలకు చేరేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాలని అన్నారు.

హైదరాబాద్ నుంచి ప్రభుత ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సమన్వయంతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. సర్వే నిర్వహణకుఅవసరమైన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకం జరగాలని వీరికి జిల్లా స్థాయిలో శిక్షణ అందించాలన్నారు. సిద్ధిపేట నుంచి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహణ చరిత్రలో నిలిచి పోయే ప్రక్రియ అవుతుందని చెప్పారు.

నల్గొండ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సర్వే నిర్వహణ షెడ్యూల్ ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారంకల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, జిల్లా అధికారులు పురుషోత్తం, నర్మద, సుబ్బారావు, నర్సింహాస్వామి, హరిప్రసాద్, వెంకటేశ్వ ర్లు, విజయనిర్మల, మరియన్న, బీమ్లానాయక్, కృష్ణవేణి, శ్రీనివాస్, విజయ, మునిసిపల్ కమిషనర్లు శాంతకుమార్, రవీందర్, వెంకటస్వామి, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మహబూబాబాద్ వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అధికారులు

సర్వేను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

8

'ఉపాధి హామీ'లో అక్రమాలు

- రూ.17,80,195 రికవరీకి అదనపు డీఆర్‌డీవో శాంతకుమారి ఆదేశాలు
- అత్యధికం వేలుబెల్లి, అత్యల్పం సాధిరెడ్డిపల్లి

8

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

- కందికొండ జాతరకు ఏర్పాట్లు చేయాలి
- డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్

కురవి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కందికొండ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పా ట్లు కల్పించాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ జాటోతు రాంచందర్‌నాయక్ అన్నారు. కార్తీకపౌర్ణమి రోజున కందగిరిపై లక్ష్మీనర్సింహాస్వామి జాతర జరుగనుంది. దీనికి ఉమ్మడి నాలుగు జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. జాతర జరిగే పర్వత ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కందికొండకు వచ్చే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, అధికారులు ముందస్తుగా రహదారులను బాగు చేయాలని ఎమ్మెల్యే సూచించారు.జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ముళ్లచెట్లను తొలగించాలని, తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, మాజీ జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, కోర్ని రవీందర్‌రెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, గొల్లపల్లి రజినీకాంత్, రఘువీరారెడ్డి, తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్, మరిపెడ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై నగేష్ పాల్గొన్నారు.



లక్ష్మీనర్సింహాస్వామి జాతర పనులు పరిశీలిస్తున్న రాంచందర్‌నాయక్

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంబాల చెరువులో మంగళవారం ఉచిత చేపపిల్లల పంపిణీలో భాగంగా చెరువులో చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులునిండి కట్టలు తెగి చేపపిల్లలు బయటకు పోయి మత్స్యకారులకు తీవ్ర నష్టం జరిగిందని, వారికి పరిహారం అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

ఇప్పటి వరకు 35 చెరువుల్లో చేపపిల్లలను వదిలినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, జిల్లా మత్స్యశాఖ అధికారి వీరన్న, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ మండలాధికారి తిరుపతిరెడ్డి, మత్ససొసైటి ప్రతినిధులు అశోక్, రమేష్, దశరధం, పెద్ది సైదులు, కాంగ్రెస్ నాయకులు ఎడ్ల రమేష్, ఖలీల్‌పాషా, శ్యాం రావు, మిట్టకంటి రాంరెడ్డి, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, శంతన్‌రామరాజు తదితరులు పాల్గొన్నారు.



కంబాల చెరువులో చేపపిల్లలను వదులుతున్న భూక్య మురళీనాయక్

మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం..

మహబూబాబాద్ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో మంచి ర్యాంకులు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను మంగళవారం శాలువాలతో సన్మానించారు. హెచ్ఎం రమేష్‌బాబు, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, పీఈటీ వెంకటేశ్వర్లు, గ్రామపార్టీ అధ్యక్షులు చీరిక ఉపేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, బెల్లంకొండ శ్రీనివాస్, చీరిక వేణురెడ్డి, స్వర్ణలత, శంతన్‌రామరాజు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్ వంశీని అభినందించిన సీఎం



మోడెం వంశీని అభినందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

వాజేడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఏజెన్సీ యువకుడు మోడెం వంశీని సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం అభినందించారు. వాజేడు మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన ఇప్పగూడెంకు చెందిన మోడెం వంశీ భద్రాచలంలోని సిటీ స్టైల్ జిమ్‌లో ట్రైనర్‌గా ఉంటూ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్నాడు. ఈ ఏడాది జూలైలో యూరప్ ఖండంలోని మాల్టా దేశంలో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించాడు. అదేవిధంగా సౌతాఫ్రికాలో జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సమక్షంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని నివాసంలో కలిసి వంశీ సాధించిన పతకాలను చూపించగా అభినందించారు. ప్రతిభకు పేదరికం అడ్డురాదని నిరూపిస్తూ రోజు కూలి ఇంట్లో పుట్టి దేశం గర్వపడేలా చేశావని వంశీని ప్రశంసించారు. వంశీకి అన్ని విధాలా ప్రభుత్వం తరఫున సాయం చేసేందుకు ముందుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

పశుగణనలో కచ్చితత్వం పాటించాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత కచ్చితత్వంతో పశు గణాంకాల నమోదు చేపట్టాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. ములుగు కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి కె.కొమురయ్యలతో కలిసి పశుగణన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుంచి నాలుగు నెలల పాటు 21వ జాతీయ పశుగణన ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకోసం జిల్లాలో 28 మంది పశుగణనకర్తలు, 9 మంది పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని 9 మండలాల్లో గల 336 రెవెన్యూ గ్రామాల్లో పశుగణన జరుగుతుందని అన్నారు. జిల్లాలోని 99,459 కుటుంబాలను సర్వేచేసి గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, ఇలా 16 రకాల పశువులు, జీవాల సంఖ్యను లెక్కించి యాప్‌లో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. పశుగణన ఆధారంగా నిధులతోపాటు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు సరఫరా అవుతాయని, ప్రజలు, రైతులు గణనకర్తలకు సహకరిస్తూ కచ్చితమైన వివరాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నరసింహ, డాక్టర్ వి.నవత, పశువైద్యాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గంజాయి ప్యాకెట్ల పట్టివేత

పాలకుర్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఒడిషాకు చెందిన వ్యక్తిని పట్టుకొని తనిఖీ చేయగా అతడి వద్ద గంజాయి 10 ప్యాకెట్లు లభ్యం కాగా వాటిని స్వాధీనం చేసుకున్నట్లు పాలకుర్తి ఎస్సై డి.పవన్‌కుమార్ తెలిపారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల వెనుకాల బైపాస్ రోడ్డులో మంగళవారం వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై ఒక పెద్ద సంచితో వెళుతుండగా అనుమానం వచ్చి పటుకుని తనిఖీ చేయగా 10 ప్యాకెట్లు లభ్యమైనట్లు వాటిని స్వాధీనం చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు ప్రారంభం

- ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి క్రీడాకారుల రాక
- పాల్గొన్న 960 మంది గురుకుల పాఠశాలల విద్యార్థులు
- ఏటూరునాగారంలో రెండు రోజుల పాటు నిర్వహణ



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా

ఏటూరునాగారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం మండల కేంద్రంలోని కొమరం భీం క్రీడా మైదానంలో 8 రీజియన్ల జోనల్ స్థాయి క్రీడలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడోత్సవాల్లో ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలోని బాల బాలికల ఎంపికలను నిర్వహించనున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారమ్, అర్చరీ, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ తదితర క్రీడలు జరిగాయి. కాగా, ఈ క్రీడలకు ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి 8 జోన్లలోని ఒక్కో జోన్ నుంచి 120 మంది విద్యార్థులకు గాను ఉమ్మడి జిల్లాలోని వివిధ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, బాల, బాలికల పాఠశాలలు, గిరిజన పాఠశాలలను నుంచి మొత్తం 960 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ముఖ్య అతిథిగా ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్‌ను పీవో చిత్రమిశ్రా సర్వీస్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు మంచి క్రమశిక్షణతో మెదిలి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్ర స్థాయిలో మంచి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని 100 శాతం ఫలితాలు సాధించాలని అన్నారు.

తొలి రోజు పోటాపోటీగా క్రీడలు..

తొలిరోజు క్రీడలు పోటాపోటీగా జరిగాయి. డ్రా పద్ధతిన పోటీలను ప్రారంభించగా, మంగళవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారమ్, అర్చరీ, టెన్నికాయిట్ ఆటలు నిర్వహించారు. వాలీబాల్ అండర్-17 విభాగంలో కరీంనగర్, కొత్తగూడె జట్లు తలపడగా కొత్తగూడెం జట్టు విజయం సాధించింది. భూపాలపల్లి, ములుగు జట్లు తలపడగా, ములుగు జట్టు గెలుపొందింది. వాజేడు, వరంగల్ జట్లు తలపడగా వరంగల్ జట్టు విజయం సాధించింది. అంతేకాకుండా బాలుర అండర్-17లో వాజేడు, కొత్తగూడెం జట్లు తలపడగా, కొత్తగూడెం విజయం సాధించింది. భూపాలపల్లి, మహబూబాబాద్ జట్లు తలపడగా, మహబూబాబాద్ జట్టు గెలుపొందింది. ములుగు, ఏటూరునాగారం జట్లు తలపడగా ఏటూరునాగారం జట్టు విజయం సాధించింది. కరీంనగర్, వరంగల్ జట్లు తలపడగా వరంగల్ జట్టు విజయం సాధించింది. అండర్-17 విభాగం ఖోఖోలో కరీంనగర్, ములుగు జట్లు తలపడగా, ములుగు విజయం సాధించింది. హనుమకొండ, ఏటూరునాగారం జట్లు తలపడగా ఏటూరునాగారం జట్టు గెలుపొందింది. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ములుగు ఏటీడీవో దేశిరామ్, ఏటూరునాగారం ఏటీడీవో క్షేత్రయ్య, ఏటూరునాగారం, భూపాలపల్లి స్పోర్ట్స్ అధికారి ఆదినారాయణ, శ్యామలత, నారాయణ, ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని వివిధ గిరిజన బాల, బాలికల వసతి గృహాల పాఠశాలల పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో ఇంత నిర్లక్ష్యమా?

- అడిషనల్ డీఆర్‌డీవో శాంతకుమారి



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న శాంతకుమారి

కొత్తగూడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా.! దుర్వినియోగమైన నిధులు జరిమానాగా చెల్లించాలి, లేనిపక్షంలో చర్యలు తప్పవని అడిషనల్ డీఆర్‌డీవో శాంతకుమారి హెచ్చరించారు. అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక (మంగళవారం) రెండోరోజు కొనసాగింది. మొండ్రాయిగూడెంలో జీపీలో ఫీల్డ్ అసిస్టెంట్ భార్య ఉపాధి హామీ పనికి వెళ్లకున్న ఆమెకు కూలీ డబ్బులు చెల్లించినట్లు, కొంత మంది గ్రామస్థులు పనికి వెళ్లకున్న వారికి కూలీ డబ్బులు చెల్లించినట్లు తనికీ బృందం పేర్కొన్నారు. కార్లాయి జీపీలో గ్రామ పంచాయతీ సిబ్బంది. ఆశ వర్కర్ ఉపాధిహామీ పనికి వెళ్లినట్లు తనికీ బృందం పేర్కొన్నారు. జీపీ వర్కర్‌లు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలను ఉపాధిహామీ పనికి రానివ్వవద్దని, వారికి జమచేసిన డబ్బులు రికవరీ చేయాలని అడిషనల్ డీఆర్‌డీవో ఆదేశించారు.

వేలుబెల్లిలో హరితహారం మొక్కలు లేవని, మన ఊరు-మన బడి పనికి రికార్డులు ఇవ్వలేదని తనికీ బృందం పేర్కొన్నారు. కొత్తపల్లిలో డబులు జాబ్‌కార్డులు ఇచ్చారని, పాత రోడ్డుపైనే మరో మారు పనిచేసినట్లు రికార్డ్ చేశారని తెలిపింది. గోపాలపురంలో ఏపీవో సంతకాలు లేకుండా రూ. 5 లక్షల, 47 వేలు పేమెంట్ చేశారని, ఫీల్డ్ అసిస్టెంట్ సంతకాలు లేకుండా రూ. 5లక్షలు పేమెంట్ చేసినట్లు గుర్తించారు. ఏపీవో, ఎఫ్‌ఏపై శాంతకుమారి ఆగ్రహం వ్యక్త చేశారు. పెగడపల్లిలో పనికి సంబంధిచిన మస్టర్‌లు ఇవ్వలేదన్నారు. రేణ్యాతండాలో పనిదినాలు రాయకపోవడంతో కూలీలు డబ్బులు పడక నష్టపోయినట్టు గుర్తించారు.

కాగా, మండలంలోని గ్రామాలలో నేమ్‌బోర్డ్‌లు లేకున్నా పనులు చేసినట్లు గుర్తించారు. నేమ్‌బోర్డ్‌లు లేకుంటే పనులు చేవద్దని హెచ్చరించారు. ప్రజావేదికలో జిల్లా అంబుడ్స్‌మెన్ ఆదాము, ఏపీవో బీమ్లానాయక్, ఎస్ఆర్పీ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఏఈవోల నిరసన



మహబూబాబాద్ రైతు వేదికలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఈవోలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి) : సస్పెండ్ అయిన ఏఈవోలను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మహబూబాబాద్‌లోని పలువురు ఏఈవోలు మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో నల్లబ్యాడ్జిలు ధరించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు రాష్ట్ర కమిటీ నాయకులతో చర్చలు జరిపి, సస్పెండ్ అయినా ఏఈవోలపై సస్పెండ్ ఎత్తివేసి విధుల్లోకి తీసుకుంటామని చెప్పినప్పటికి చర్చలు జరుపలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సాయిప్రకాష్, రంజిత్, పున్నమి, సరిత, షాహీన, లావణ్య పాల్గొన్నారు.

నెల్లికుదురు : ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ నెల్లికుదురులోని రైతువేదికలో ఏఈవోలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ డిజిటల్ క్రాప్‌సర్వేను నిరాకరించినందుకు ఏఈవోలను సస్పెండ్ చేయడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రవి, మనికంఠ, కళలలాల్యాణి, చందన పాల్గొన్నారు.

మరిపెడ : ఏఈవోలపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని మరిపెడ మండల ఏఈవోలు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఈవోల సంఘం మండల బాధ్యులు వేములకొండ సైదమ్మ మాట్లాడుతూ డిజిటల్ క్రాప్ సర్వే బైకాట్ చేసిన ఏఈవోలను సస్పెండ్ చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ నిరసనలో ఏఈవోలు స్వేత, శృతి, స్రవంతి, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, అన్వేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జనగామ కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మండలంలోని శామీర్‌పేట, వడ్లకొండ్లలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని, ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని రైతులకు ఇబ్బందులు కల్లకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకి ధాన్యం తెచ్చే ప్రతీ రైతుకు టోకెన్లకు జారీ చేయాలని, టోకెన్ల ప్రకారమే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రాల వద్ద టార్పలిన్, ధాన్యం కొనుగోలుకు కావల్సిన పరికరాలు, గోనె సంచులను అందుబాటులో ఉంచాలన్నారు. కలెక్టర్ సివిల్ సప్లై డీటీ ఇట్టబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగు మేలు



మీదికొండలో పత్తిచేనును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులు అధిక సాంద్రత (ఎక్కువ మొత్తంలో మొక్కలు) పద్ధతిలో పత్తి మొక్కలు నాటినట్లయితే రైతులకు అధిక దిగుబడి వస్తుందని కోయంబత్తూర్ కేంద్రీయ పత్తి పరిశోధన కేంద్రం సీనియర్ సైంటిస్టు డాక్టర్ శంకర్ గణేష్ కోరారు. మండలంలోని మీదికొండ గ్రామంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తిసాగు వల్ల కలిగే ప్రయోజనాల రైతు కాసాని వెంకటయ్య సాగుచేసిన పత్తిచేనును క్షేత్రస్థాయిలో పై వివిధ గ్రామాలకు చెందిన రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో శంకర్ గణేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సైంటిస్టులు డాక్టర్ బి. అనిల్‌కుమార్, డాక్టర్ ఓంప్రకాష్, డాక్టర్ అశ్విని, రాజారెడ్డి, మురళీమోహన్, సంపత్, రైతులు వెంకట్ రెడ్డి, లోడంగి శ్రీనివాస్, కిరణ్, రమేశ్, థామస్, పొన్నం లక్ష్మయ్య, మధు, గౌరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓసీ-3లో విజిలెన్స్ తనిఖీలు

- రెండు లోడర్లను పక్కకు నిలిపినట్లు సమాచారం
- అధిక మీటర్ రీడింగ్ రాసినట్లు గుర్తించిన అధికారులు?

కాకతీయఖని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్-3లో మంగళవారం విజిలెన్స్(ఎస్‌టీపీపీ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ పనుల కోసం యాజమాన్యం ప్రైవేటు కాంట్రాక్టర్‌కు కాంట్రాక్ట్‌ను అప్పగించింది. అయితే సదరు కాంట్రాక్టర్ బొగ్గును లారీల్లో లోడ్ చేసేందుకు లోడర్లను ఏర్పాటు చేశారు. అయితే బండి(లోడర్) తిరగకున్నా(పని చేయకున్నా) మీటర్ రీడింగ్ వచ్చేలా రీడింగ్ సెట్ చేసినట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు ఎంక్వైరీ చేపట్టారు. లోడర్ స్టార్ట్ చేసి ఉంచితే(తిరగకున్నా) మీటర్ రీడింగ్ వస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో రెండు లోడర్లను పక్కకు నిలిపి సంబంధిత లోడర్ల ఆపరేటర్లను విచారించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఓసీ-3 అధికారులు పని జరిపించేందుకు సంస్థకు సంబంధించిన 200 కెపాసిటీ గల షావల్, ప్రైవేటు కాంట్రాక్టర్‌కు సంబంధించిన 470 కెపాసిటీ గల టాటా ఇటాచ్ షావల్‌తో బొగ్గును లారీల్లో లోడ్ చేయించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా సదరు కాంట్రాక్టర్ బండ్లు పెట్టినప్పటి నుంచి రోజుకు సుమారు 6 నుంచి 9గంటలు అదనంగా రీడింగ్ చూపిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందడంతో ఆకస్మిక తనిఖీలు చేపటినట్లు సమాచారం. గత కొంత కాలంగా సదరు కాంట్రాక్టర్ మీటర్ రీడింగ్ అధికంగా చూపిస్తుంటే బిల్లు పెట్టే క్రమంలో సింగరేణి అధికారులకు లోడర్లు ఎంత పనిచేశాయి అనే అవగాహన లేకుండా పోయిందా..?, 21 రోజులకు ఒకసారి ఫిట్‌నెస్ ఇచ్చే ఈఅండ్ఎం అధికారులకు ఈ విషయం తెలియకుండానే ఉందా.. అనే ప్రశ్నలు కార్మికుల్లో తలెత్తుతున్నాయి. విజిలెన్స్ తనిఖీల విషయం సింగరేణి అధికారులను అడుగగా తనిఖీ చేసిన మాట వాస్తవమేనన్నారు. బండ్లను పక్కకు నిలిపి ఆపరేటర్లను విచారించినట్లు తెలిపారు. దీంతో బొగ్గు లోడింగ్ కోసం వేరే ఏర్పాట్లు చేశామన్నారు.

ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ఉన్నత పాఠశాలలు, గురుకులాల ఉపాధ్యాయులు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ మోడల్‌స్కూల్, శివునిపల్లి హైస్కూల్‌లో ఓటర్ల నమోదు ప్రచార కార్యక్రమంలో మంగళవారం ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. గతంలో ఓటర్లుగా ఉన్న వారు కూడా ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రతీ ఒక్కరు నూతనంగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి నవంబరు 6వ తేదీ ఆఖరు అన్నారు. మరోసారి ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలుస్తున్నానని తనను ఉపాధ్యాయులు గెలిపించాలన్నారు. బదిలీలు, పదోన్నతులు, డీఎస్సీ నియామకాలు తదితర అంశాల్లో తన వంతు కృషి చేశానన్నారు. పెండింగ్ డీఏలు, బిల్లులు అన్ని మంజూరు కావడానికి ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమాల్లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ రావు, జిల్లా కార్యదర్శి కె.సుధీర్ రెడ్డి, నాయకులు ఎం.కృష్ణమూర్తి, జి.కృష్ణ, కనకయ్య, టి.శ్రీనాథ్, ఫకీర్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.



ఘన్‌పూర్ మోడల్ స్కూల్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

భూపాలపల్లి జిల్లాలో మావోయిస్టు లేఖ కలకలం

- ప్రజాప్రతినిధుల పేర్లు ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు

భూపాలపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధుల పేర్లను పేర్కొంటూ భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట మంగళవారం విడుదలైన ఓ లేఖ కలకలం రేపింది. అయితే దళితబంధు డబ్బులు ఇప్పిస్తామంటూ మోసగించారని, వారికి శిక్ష తప్పదని జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధుల పేర్లను ప్రస్తావించడం తీవ్ర చర్చనీయాంశమైంది. సదరు నాయకులు దళితబంధు పథకం వర్తింపజేసి లబ్ధి చేకూరుస్తామంటూ.. తొలి విడత, మలి విడతలో డబ్బులు వస్తాయంటూ అమాయక దళిత ప్రజల నుంచి రూ.లక్షలు వసూలు చేశారని ఆ లేఖలో ఆరోపించారు. ఈ క్రమంలో మహాముత్తారం, కాటారం, పలిమెల, మల్హర్ మండలాలతో పాటు భూపాలపల్లి పట్టణానికి చెందిన పలువురు నాయకులు డబ్బులు వసూలు చేసి ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. ఆ లేఖలో వారి పేర్లను ప్రస్తావిస్తూ ఇప్పటికైనా దళితబంధు పేరిట తీసుకున్న డబ్బులను వెంటనే ప్రజలకు తిరిగి చెల్లించాలని.. లేదంటే ప్రజల చేతిలో వారికి శిక్ష తప్పదంటూ హెచ్చరిస్తూ లేఖను పంపించారు. అయితే ఈ లేఖ విషయంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఈ లేఖ నిజమైనదేనా? లేదా ఎవరైనా కావాలని సదరు నాయకులను టార్గెట్ చేస్తూ విడుదల చేశారా అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సింగరేణి క్లేపిల్స్ షెడ్డులో చోరీ

- రెండు గేర్ బాక్స్‌లను ఎత్తుకెళ్లిన దుండగులు



గేర్ బాక్స్ లేకుండా ఉన్న మోటారు

కాకతీయఖని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని క్లేపిల్స్ షెడ్డులో గత శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏరియాలోని అండర్ గ్రౌండ్ గనులకు మట్టి గుట్కాలు తయారు చేసే క్లేపిల్స్ షెడ్డులోని రెండు మోటార్లకు సంబంధించిన గేరు బాక్సులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు సింగరేణి కార్మికులు చెబుతున్నారు. కేటీకే-5వ గని సమీపంలో అండర్ గ్రౌండ్ గనిలో బ్లాస్టింగ్ కోసం మట్టి గుట్కాలను తయారు చేసేందుకు ఓ షెడ్డును సింగరేణి అధికారులు ఏర్పాటు చేశారు. అందులో రెండు మోటార్లను బిగించి వాటిలో ఎర్రమట్టి నింపి గుట్కాలను తయారు చేస్తుంటారు. ఆ మోటార్లకు సంబంధించిన విలువైన గేరు బాక్స్‌లను దొంగలు ఎత్తుకెళ్లారు. అయితే సింగరేణి సెక్యూరిటీ ఉద్యోగులు నిత్యం పెట్రోలింగ్ చేయకపోవడంతోనే ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. గతంలో 5వ గని వేబ్రిడ్జి దగ్గర సెక్యూరిటీని నియమించేవారని, వారు వేబ్రిడ్జితో పాటు సాండ్ బంకర్, ఫ్యాన్ హౌజ్, సీహెచ్‌పీ, క్లేపిల్ షెడ్డులో ఎలాంటి చోరీలు జరగకుండా చూసేవారని చెబుతున్నారు. ప్రస్తుతం అక్కడ సెక్యూరిటీని నియమించడం లేదని అంటున్నారు. సెక్యూరిటీ అధికారులు నిర్లక్ష్యం వీడి ఏరియాలో తరచూ జరుగుతున్న దొంగతనాలను అరికట్టాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. చోరీకి గురైన గేరు బాక్స్‌ల విషయమై ఏరియా సింగరేణి అధికారులను అడుగగా వాస్తవమేనన్నారు.

వేలం పాట ఖరారు

రేగొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగులోని వేంకటేశ్వరస్వామి జాతర వేలం పాటలు దేవాదాయ శాఖ పర్యవేక్షకులు కవిత ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయలు రూ.1.47లక్షలు, పుట్నాలు, పేలాలు రూ.4,500, లడ్డు, పులిహోర రూ.2.03లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ టెండర్ల ద్వారా మొత్తం రూ.3,54,500 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో బుగులోని జాతర ఛైర్మన్ వెంకటస్వామి, అర్చకులు కూర్మాచలం వెంకటేశ్వర్లు, గ్రామ కమిటీ అధ్యక్షుడు విజేందర్, డైరెక్టర్ జితేందర్, గ్రామ పెద్దలు రమణారెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు పిచికారీ చేస్తూ..

అస్వస్థతకు గురై రైతు మృతి



లక్ష్మీనారయణ (ఫైల్)

మేడారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పంట పొలంలో దోమ మందు పిచికారి చేస్తూ అస్వస్థతకు గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన చంద లక్ష్మీనారాయణ తన పొలంలో పురుగు మందు పిచికారి చేయడానికి ఉదయం వెళ్లాడన్నారు. పొలంలో పూర్తిగా మందు పిచికారి చేసి ఇంటికి వెళ్లే సమయంలో గట్టు పైనుంచి పొలంలో పడిపోయాడని తెలిపారు. అస్వస్థతకు గురై అక్కడికక్కడే మృతి చెందాడని చెప్పారు. గమనించిన పక్క పొలం రైతులు వెళ్లే సరికే మృతి చెందాడన్నారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు చెప్పారు. ఆయనకు భార్య రాఘవేంద్ర ఉందన్నారు. వారికి పిల్లలు లేరని తెలిపారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దీపం.. లక్ష్మీ స్వరూపం

రేపు దీపావళి పర్వదినం

- ఉదయం మంగళహారతులు, సాయంత్రం ధనలక్ష్మీ పూజలు
- టపాసుల కొనుగోలుతో మార్కెట్‌లో సందడి
- ఊపందుకున్న పూలు, పండ్లు, ప్రమిదల అమ్మకాలు



వరంగల్ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అంధకార చీకట్లను పారదోలే లక్ష్మీ స్వరూపం.. దీపం. ఆధ్యాత్మికంగా ప్రత్యేక విశిష్టతను కలిగి ఉన్న దీపాల పండుగ దీపావళిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఆశ్వయుజ అమావాస్య సందర్భంగా గురువారం ఇళ్లు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకోనున్నారు. ఇక ఈ పండుగ వచ్చిందంటే బాణసంచా, వివిధ రకాల మిఠాయిలు, భగవంతుడి ఆరాధనకు ఉపయోగించే పూలు, పండ్లు, దీపాలు వెలిగించే ప్రమిదల అమ్మకాలు జోరందుకుంటాయి. దీపావళి అంటే ఒక రోజు ముందుగా భోగి, నరక చతుర్దశిగా ఆచరించుకుంటారు. లోకాన్ని ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెట్టి హతమారుస్తున్న నరకాసురుడు అనే రాక్షసుడిని శ్రీకృష్ణభగవానుడి భార్య సత్యభామ సంహరించడం ఆ రోజు చతుర్దశి కావడంతో నరక చతుర్దశిగా పిలుస్తారు. శ్రీరామచంద్రుడు లంకలో రావణాసురుడిని సంహరించి సీతామాతతో తన పరివారంతో అయోధ్యకు చేరుకున్న రోజు అమావాస్య కావడం, ప్రజలు ఆ రోజున దీపాలను వెలిగించి పండుగను జరుపుకోవడంతో నాటి నుంచి దీపావళి పర్వదినం కాంతులు వెదజల్లుతోంది. అమావాస్య సాయం సంధ్యా సమయం దీపం వెలిగించడం వల్ల లక్ష్మీదేవి ఇంటికి వచ్చి సిరిసంపదలను అనుగ్రహిస్తుందని పురాణాల్లో ప్రసిద్ధి. నాటి నుంచి దీపావళి పర్వదినాన్ని ఆచరించుకుంటున్నారు. దీపావళి సందర్భంగా గురువారం ఉదయం 3 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మంగళహారతులు తీసుకోవాలని, సాయంత్రం ప్రదోషకాలంలో దీపాలు వెలిగించి సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ధనలక్ష్మీ పూజలను ఆచరించు కోవచ్చని పండితులు చెబుతున్నారు. పండుగ నేపథ్యంలో బాణసంచా, వస్త్ర వ్యాపారం జోరందుకుంది. దీంతో మార్కెట్‌లో జనం రద్దీ కనిపిస్తోంది. కొత్తగా పెళ్లైన అల్లుళ్లకు దీపావళి కట్నాలు పెడతారు. అలాగే వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారు దీపావళి పండుగకు తమ సొంతూళ్లకు చేరుకుంటుడంతో సందడి వాతావరణం కనిపిస్తోంది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు కిటకిట లాడుతున్నాయి.

నేడు నరకాసుర వధ

సిద్ధమైన 58 అడుగుల భారీ ప్రతిమ ● వరంగల్ ఉర్సు గుట్ట మైదానంలో ఏర్పాట్లు



గతంలో ఏర్పాటు చేసిన రావణ ప్రతిమ

కరీమాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్సవాలకు నిలయమైన వరంగల్ ఉర్సు గుట్టలోని రంగలీలా మైదానం మరో వేడుకకు సిద్ధమైంది. రాక్షస సంహారాలకు వేదికగా పిలుచుకునే ఈ ప్రాంతంలో ఇటీవలి దసరా వేడుకల్లో భాగంగా రావణవధను నిర్వహించారు. మళ్లీ దీపావళి సందర్భంగా బుధవారం జరగబోయే నరకాసుర వధ కోసం సర్వం సిద్ధం చేస్తున్నారు. త్రి నగరి ప్రజలకు దీపావళి పర్వదినాన ఆనందాల వెలుగులను అందించేందుకు ఉర్సు గుట్టను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. 22 సంవత్సరాలుగా దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉర్సు నరకాసుర వధ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో ప్రధానంగా 58 అడుగుల భారీ నరకాసుర ప్రతిమను శక్తివంతమైన బాణసంచాతో దహనం చేసేందుకు, ప్రత్యేక బాణసంచా విన్యాసాలకు అంతా సిద్ధం చేశారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో విద్యుత్‌దీపాలు, సౌండ్ బాక్సులు, బారికేడ్లు, భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లు, పార్కింగ్ ప్రదేశాలు తదితర ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రం 5.30గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో ఉర్సు ప్రతాప్‌నగర్ నుంచి శ్రీకృష్ణ సత్యభామ వేషాధారణలో స్థానిక కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలతో, కోలాటాలతో, భజనలతో, మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపుతో రథం గుట్టకు చేరుకుంటారు. ఆ తరువాత వేదికపై సాంస్కృతిక ప్రదర్శనలిస్తారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, శాసన మండలి డిప్యూటీ వైస్ చైర్మన్ బండా ప్రకాష్, శాసనమండలి సభ్యుడు బస్వరాజు సారయ్య, ఎంపి కడియం కావ్య, కలెక్టర్ సత్యశారద, కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీపీ అంబర్‌కిషోర్ ఝా, భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు, ఆర్‌డీవో, ఖిలావరంగల్ ఎమ్మార్వో, పలువురు అధికారులు, స్థానిక కార్పొరేటర్లు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. ఏర్పాట్లను నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి, ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలరావు, కోశాధికారి కనుకుంట్ల రవి, మహిళా విభాగం ప్రతినిధి మరుపల్ల భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు వనం మధుతో పాటు సహాయ కార్యదర్శులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షిస్తునారు.

సీతంపేటలో దీపావళి బతుకమ్మ

మూడు రోజుల పాటు ఉత్సవాలు ● వేర్వేరుగా జరుపుకోనున్న స్త్రీ, పురుషులు ● రాష్ట్రంలోనే ఇదో ప్రత్యేక వేడుక



ఎద్దుల ప్రతిమలను కుంటలో నిమజ్జనం చేస్తున్న పురుషులు (ఫైల్)

హసన్‌పర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సహజంగా దసరా రోజుల్లో బతుకమ్మ వేడుకలు జరుగుతాయి. కానీ హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేటలో మాత్రం దీపావళి సందర్భంగా ఇక్కడి ప్రజలు బతుకమ్మ వేడుకలను నిర్వహించుకుంటారు. మూడు రోజుల పాటు ఇక్కడ జరిగే ఈ బతుకమ్మ వేడుకలు రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. మహారాష్ట్ర నుంచి ఇక్కడకు వలస వచ్చి స్థిరపడిన నేతకాని కులస్థులు తమ పూర్వీకుల ఆచారమైన ఈ వేడుకలను పాటిస్తున్నారు. ఈ పండుగలో మొదటి రోజు దీపావళి పర్వదినం రోజున కుటుంబ సమేతంగా కేదారీశ్వరస్వామి వ్రతాన్ని ఆచరిస్తారు. రెండవ రోజు పురుషులు ఎద్దుల ప్రతిమలకు రకరకాల పిండి వంటలతో తయారు చేసిన నగలతో ఊరేగించి.. అనంతరం చెరువులో నిమజ్జన కార్యక్రమం చేస్తారు. మూడవ రోజు మహిళలు తీరొక్కపూలను సేకరించి పేర్చిన బతుమకమ్మ ఊరేగింపుతో ఊరు శివారులోని చెరువుకు చేరుకొని బతుకమ్మ ఆటపాటలతో సంబురంగా గడిపి గౌరమ్మను గంగకు చేర్చుతారు. దాంతో మూడు రోజుల నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకలు ముగుస్తాయి.



బతుకమ్మలతో తరలివస్తున్న మహిళలు (ఫైల్)

వివిధ రాష్ట్రాల నుంచి సీతంపేటకు...

సీతంపేటలో నిర్వహించే దీపావళి బతుకమ్మ వేడుకలకు వివిధ రాష్ట్రాలలో స్థిరపడిన నేతకాని కులస్థులు, వారి బంధువులు ముందు రోజే చేరకుంటారు. ఇక ఈ వేడుకల్లో రెండో రోజు పురుషుల ప్రత్యేక కార్యక్రమమైన ఎద్దుల ప్రతిమల ఊరేగింపులో యువకుల కోలాటం ఆసక్తి కలిగిస్తుంది. అంతేకాకుండా ఎద్దుల ప్రతిమలను చెరువు గట్టు వద్దకు తీసుకెళ్లి వరుసైన వారితో సరసం చేయడం మరింత ఆసక్తికరంగా ఉంటుంది. అనంతరం నగలుగా అలంకరించిన రకరకాల పిండి వంటలను ఆరగించి ఎద్దుల ప్రతిమలను చెరువులో నిమజ్జనం చేసి యువకులు రంగులు చల్లుకొని సంబుర చేసుకుంటారు. మూడో రోజు మహిళలు బతుకమ్మలతో ఊరేగింపులో పురుషుల కోలాటం, పాటలు ఆకట్టుకుంటాయి.

ప్రత్యేక నిధులు కేటాయించాలి..

జనగాం శరత్‌కుమార్, సీతంపేట మాజీ సర్పంచ్

సీతంపేటలో నేతకాని కులస్థులు మూడు రోజుల పాటు నిర్వహించుకునే దీపావళి బతుకమ్మ వేడుకలకు ఎమ్మెల్యే సీడీఎఫ్ ఫండ్ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేతకాని కులస్థుల ఆత్మగౌరవాన్ని కాపాడడమే కాకుండా వారు నిర్వహించుకునే దీపావళి బతుకమ్మ వేడుకల నిర్వాహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

దీపావళి బతుకమ్మ ఎంతో ప్రత్యేకం

బండారి రజితచేరాలు, మాజీ ఎంపీటీసీ

రాష్ట్రంలో దసరా సమయంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించుకునే బతుకమ్మ వేడుకలకు ఎంత ప్రాముఖ్యం ఉందో.. సీతంపేటలో జరిగే దీపావళి బతుకమ్మ వేడుకలకు కూడా అంత ప్రత్యేకత ఉంది. కేవలం ఒక్క సీతంపేటలో జరుపుకునే ఈ దీపావళి బతుకమ్మ వేడుకలను ప్రపంచానికి చాటిచెప్పాలనే మా ఆరాటం. ప్రభుత్వం కూడా అందుకు పూర్తి సహాయసహకారాలు అందించాలి.

కాళేశ్వరంలో 'కార్తీక' ఏర్పాట్లు

మహదేవపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : శుభ ప్రదం.. శివ ప్రీతికరంమైన కార్తీక మాసం నవంబరు 2వతేదీ శనివారం నుంచి ప్రారంభం కానుండటంతో గోదావరి తీరంలోని కాళేశ్వరంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్తీక మాసంలో కాళేశ్వర క్షేత్రాన్ని సందర్శించినా, స్వామిని దర్శించినా, స్మరించినా సకల పాపాలు పోయి దీర్ఘాయువుతో జీవిస్తారని భక్తుల నమ్మకం. త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా అలరాలుతున్న ఈ క్షేత్రం దక్షిణంగా అర్ధచంద్రాకారంగా గోదావరి నది ప్రవహిస్తోంది. రాష్ట్రంలోని సుప్రసిద్ధ క్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతున్న కాళేశ్వర ముక్తీశ్వర దివ్య క్షేత్రంలో కాళేశ్వర, ముక్తీశ్వర స్వామివార్లు కొలువై ఉన్నారు. ఒకే పానవట్టంపై రెండు లింగాలున్న ఆలయంగా ఈ క్షేత్రం ప్రసిద్ధి చెందింది. కాకతీయ రుద్రదేవుడి కాలంలో నిర్మాణం జరిగినట్టు పురాణాలు చెబుతుండగా ఎందరో మహా మునులు ఆలయ అభివృద్ధికి అనేక పూజలు చేసినట్టు చెబుతుంటారు. ఏటా కార్తీక మాసంలో తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో లక్షలాది భక్తులు తరలొస్తారు. ఈ క్రమంలో కార్తీక మాసమంతా ప్రత్యేక పూజలు జరుగుతాయని, లక్ష వత్తుల పూజలు , లక్ష దీపాలు వెలిగించడం, లక్ష ముగ్గులు, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, దీపారాధనలు, ఉసిరికాయలో గోదావరి పుణ్యస్నానాలు, స్వామివారికి రోజువారిగా మహారుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, శుభానంద దేవికి కుంకుమ పూజలు చేస్తారు. కాగా ఆలయంలో కార్తీక మాసం మొత్తం నిత్యాన్నదానం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. లక్ష పత్రి పూజల్లో పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నెలంతా పూజలు, కార్యక్రమాలు

2వ తేదీ నుంచి కార్తీక మాసమంతా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో దేవస్థానం వారు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహిస్తారు. రోజూ సాయంత్రం 6గంటల నుంచి దేవాలయంలో సామూహిక దీపోత్సవం ఉంటుంది. అందుకు కావాల్సిన వత్తులు, మట్టి ప్రమిదలు, నూనె దేవస్థానం వారే అందిస్తారు. అలాగే సోమవారం వచ్చే 4, 11, 18, 25 తేదీల్లో, కార్తీక పౌర్ణమి రోజైన 15వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి దేవాలయంలో సామూహిక సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహిస్తారు. 12, 15వ తేదీల్లో మంగళవాయిద్యాలతో గోదావరి వద్దకు వెళ్లి పంచరత్నాలతో హారతి సమర్పిస్తారు. 14వ తేదీ వైకుంఠ చతుర్దశి సందర్భంగా రాత్రి 8 గంటల నుంచి భజన, ప్రవచన కార్యక్రమం, 15వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి దేవాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు ఉంటాయి. అదే రోజున 7గంటలకు జ్వాలా తోరణం నిర్వహిస్తారు.

పర్యవేక్షణేదీ?

నగరంలో నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా దందా

అనుమతుల్లేకుండా గోదాములు, దుకాణాల్లో యథేచ్ఛగా విక్రయాలు

మట్టెవాడ, అక్టోబరు 29: (ఆంధ్రజ్యోతి) : దీపావళి పర్వ దినం నేపథ్యంలో ఏటా రూ.కోట్లలో బాణసంచా వ్యాపారం జరుగుతుంది. ముఖ్యంగా త్రినగరిలో మూడురోజుల పాటు అమ్మకాలు జోరుగా సాగుతాయి. ఈ క్రమంలో బాణసంచా విక్రయాలపై అధికార యంత్రాంగం తరపున పర్యవేక్షించే వారు ఎక్కడా కనిపించకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల మధ్యే గోదాములు, దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యాపారులంతా వరంగల్ నగరంలోని పాతబీటు బజార్, బట్టల బజార్, దేశాయిపేట రోడ్డు, నర్సంపేట రోడ్డు, స్టేషన్ రోడ్డు, ఎల్‌బీ నగర్, కరీమాబాద్, రామన్నపేట, పాపయ్యపేట చమన్, హంటర్ రోడ్డు కేంద్రంగా ఉండే హోల్‌సేల్ దుకాల నుంచి సరుకు కొనుగోలు చేస్తుంటారు. నెల రోజుల ముందుగానే ఇక్కడి హోల్‌సేల్ వ్యాపారులు శివకాశి నుంచి దిగుమతి చేసుకున్న టపాసులను హోల్‌సేల్, రిటైల్ పద్ధతులలో అమ్మకాలు జరుపుతుంటారు. సుమారు 20చోట్ల పెద్ద ఎత్తున అమ్మకాలు జరుగుతుంటాయి. కానీ సదరు దుకాణాల వద్ద కనీస నిబంధనలు, ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బట్టలబజార్, రామన్నపేట, హంటర్ రోడ్డు లాంటి రద్దీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున బాణసంచా నిల్వలు చేసి అమ్మకాలు జరుపుతున్నారని, మరికొన్ని చోట్ల ఇళ్ల మధ్యలోనే గోదాంలను ఏర్పాటు చేసి బాణసంచా నిల్వ చేశారని సమాచారం. ఈ క్రమంలోనే మంగళవారం వరంగల్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కరీమాబాద్ శాకరాశి కుంట సమీపంలో అనుమతి లేకుండా నిల్వ చేసిన రూ.48లక్షల బాణసంచాను సీజ్ చేశారు.

రూ.కోట్లలో వ్యాపారం

దీపావళి పండుగ సమయంలో బాణసంచా వ్యాపారం రూ.కోట్లలో ఉంటుంది. వరంగల్ బీటు బజార్, రామన్నపేట, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ ప్రాంతాలలో అధికంగా హోల్ సేల్ వ్యాపారం సాగుతుంది. దీనికి తోడు జిల్లాలో అనేక చోట్ల పలు ఫంక్షన్‌హాళ్లు, కళాశాలల మైదానాలు, తదితర చోట్ల టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు. కాగా, వ్యాపారులు టాపాసులు కొనుగోలు చేసే వారికి ఎలాంటి రసీదులు ఇవ్వడం లేదని, దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

299షాపులకు తాత్కాలిక లైసెన్సులు

వరంగల్ జిల్లాలో 71, హనుమకొండ జిల్లాలో 228 తాత్కాలిక షాపులకు అనుమతులు ఇచ్చారు. వరంగల్‌లో వివేకానంద జూనియర్ కళాశాల గ్రౌండ్, పోచమ్మమైదాన్ గ్రౌండ్, హనుమకొండలో హయగ్రీవాచారి మైదానం, కాజీపేట మార్కెట్ స్థలంలో తాత్కాలిక వ్యాపారం నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చారు.

అప్రమత్తత అవసరం..

ఎస్. శ్రీధర్‌రెడ్డి, అగ్నిమాపక అధికారి, వరంగల్ జిల్లా



అప్రమత్తతోనే ప్రమాదాలు నివారించవచ్చు. వరంగల్ జిల్లాలో 71, వరంగల్ నగరంలో ఆరు చోట్ల బాణాసంచాల విక్రయాలకు తాత్కాలిక లైసెన్స్‌లు ఇచ్చాం. అనుమతి లేకుండా వ్యాపారం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. విక్రయదారులు అగ్నిమాపక శాఖ సూచనలను విధిగా పాటించాలి. దుకాణాల అనుమతి తీసుకోవాలి. నాణ్యమైన టాపాసులు అమ్మాలి. విక్రయ కేంద్రాల్లో ఇసుక, నీరు, మంటలను ఆర్పే పరికరాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి.

తాత్కాలిక షాపుల ఏర్పాటులో నిబంధనలివీ..

- ఒక్కో షాపునకు మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలి.
- దుకాణాలను రేకుల షెడ్డులోనే ఏర్పాటు చేయాలి.
- ప్రతీ దుకాణం ఎదుట 200లీటర్ల రెండు నీటి బ్యారెల్లను అందుబాటులో ఉంచాలి.
- మంటలు ఆర్పే యంత్రం, ఇసుక బకెట్లు ఏర్పాటు చేయాలి.
- దుకాణాల వద్ద చెత్త, చెదారం వేయకూడదు.
- షాపుల్లో పెట్రోమాక్స్‌లైటు గానీ, దీపాలుగానీ వాడకూడదు.
- విద్యుత్ సరఫరాకు ఐఎస్‌ఐ మార్క్ కలిగిన నాణ్యమైన వైర్లనే వాడాలి.
- దుకాణాలకు 100 మీటర్ల పరిధిలో టపాసులను కాల్చరాదు.
- 18 ఏళ్లలోపు పిల్లలను షాపులో పనికి పెట్టుకోకూడదు.
- విక్రయదారులు కాటన్ దుస్తులనే ధరించాలి.

టపాసులు కాల్చడంలో జాగ్రత్తలు అవసరం

దివ్వెల పండుగ దీపావళి ఆనందంగా జరుపుకోవాలి తప్ప విషాదానికి దారి తీయకుడదు. అందుకు పలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. బాణసంచాను ఇంటి లోపల కానీ, కారిడార్‌లో కానీ కాల్చరాదు. విశాలమైన ప్రదేశంలోనే కాల్చాలి. బాణసంచా కాల్చే సమయంలో కాటన్ దుస్తులను ధరించాలి. సరిపడా నీటిని అందుబాటులో పెట్టుకోవాలి. నాణ్యమైన బాణసంచాను మాత్రమే కొనుగోలు చేయాలి. పిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే కాల్చాలి. ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు వెంటనే అగ్నిమాపక కేంద్రం, పోలీసులకు సమాచారం అందించాలి. క్షతగాత్రులైతే ఆస్పత్రులకు తరలించాలి.

పొగమంచు.. గమనించు..

మంచుతో రహదారిపై ముప్పు

మట్టెవాడ (వరంగల్), నవంబరు 29: (ఆంధ్రజ్యోతి): చలికాలం పొగమంచు కారణంగా రహదారులపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ఎదుటి వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారులపై దట్టంగా కమ్మేసిన పొగమంచు రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతోంది. అతివేగానికి తోడు పొగమంచుతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. చెరువులు, లోతట్టు ప్రాంతాలు, ఎక్కువగా చెట్లు, తోటలు ఉండే చోట పొగ మంచు ఎక్కువగా ఉంటోంది. తెల్లవారుజామున జరిగే ప్రమాదాల్లో డ్రైవర్లు నిద్ర మత్తులో ఉండడం కూడా మరో కారణమవుతోంది. అందువల్ల ఉదయం 7 గంటల తర్వాత మాత్రమే ప్రయాణించాలని, హెడ్‌లైట్లు, వెనుకలైట్లు, ఇండికేటర్లు వేసుకొని వాహనాలు నడపాలని రవాణశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.

మంచులో జాగ్రత్తగా..

- చలికాలం మంచు కురుసే సమయంలో ముందున్న వాహనం కనిపించక రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అందువల్ల డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- మంచు దట్టంగా కురిసే సమయంలో ప్రయాణాలను మానుకుంటే మంచిది. అనివార్యమైతే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కచ్చితంగా హెడ్‌లైట్‌లు వెలుగుతూనే ఉండాలి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఎదురుగా వచ్చిన వాహనాలు ఢీకొట్టే ప్రమాదం ఉంటుంది.
- రోడ్ల పక్కన బండి నిలిపితే హెడ్‌లైట్‌తోపాటు వెనుకలైట్లు కూడా వెలుగుతూ ఉండాలి. దీనివల్ల ఇతర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. వాహనం చుట్టూ రేడియం టేపు తప్పనిసరిగా ఉంచాలి. దీనివల్ల మంచుకురిసే సమయంలో వాహన ఉనికి తెలుస్తుంది. వాహనం నడిపేటప్పుడు వైపర్‌ను వాడాలి. లోబీం లైట్లు వేస్తే రోడ్డు కనిపించడంతోపాటు కాంతిదూరం ఎక్కువగా ఉంటుంది.
- ముందు వెళ్లే వాహనాల నుంచి సురక్షిత దూరాన్ని పాటించాలి.
- వాహనం నడిపేటప్పుడు ఇండికేటర్ లైట్లు వేసుకొని వెళ్లాలి.
- కేవలం 30, 40 స్పీడ్‌తోనే వాహనం నడపాలి.
- వాహన అద్దాలపై పడే మంచును తుడిచేయడానికి డీఫాగర్‌ను వినియోగించాలి.
- ప్రధాన లైట్లు, సిగ్నల్ లైట్లు, లోబీం లైట్లు అన్ని వెలిగించి వాహనాలు నడపాలి.
- రోడ్డు స్పష్టంగా కన్పించకపోతే సురక్షితమైన స్థలంలో వాహనాన్ని నిలిపివేయాలి
- వాహనాల మధ్య కచ్చితమైన దూరాన్ని పాటించాలి.
- విండ్ స్క్రీన్ సైడ్‌మిర్రర్లపై ఎప్పటికప్పుడు మంచును శుభ్రం చేయాలి.

మహిళల స్వావలంబనే లక్ష్యంగా..

- 'నమో డ్రోన్ దీదీ' పథకం అమలుకు
- పూర్తి రాయితీతో డ్రోన్ల పంపిణీ, శిక్షణ
- ఎకరం పంటపై 8నిమిషాల్లో మందుల పిచికారీ.. రూ.400అద్దె



నెల్లికుదురు మండలం బ్రాహ్మణపల్లిలో డ్రోన్‌తో పురుగుమందును పిచికారి చేస్తున్న డ్రోన్ పైలెట్ అమృత

కేసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పద్ధతులను ఆధునీకరించడంతోపాటు మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వం 'నమోడ్రోన్ దీదీ' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద ప్రయోగాత్మకంగా రాష్ట్రానికి తొలి విడతలో ఒక ప్రముఖ కంపెనీ ద్వారా 150 వ్యవసాయ డ్రోన్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా ప్రతీజిల్లాకు యూనిట్లను కేటాయించారు. నాబార్డు ఆధ్వర్యంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీవో) ద్వారా వందశాతం రాయితీతో సుమారు రూ.8లక్షల విలువైన వ్యవసాయ డ్రోన్లను అందించారు. వాటిలో మహబూబాబాద్ జిల్లాకు మూడు యూనిట్లు రాగా.. ఒక్కొక్కటి చొప్పున ముగ్గురు మహిళలకు అందించారు. స్వయం సహాయక సంఘాల్లో విద్యావంతులైన మహిళలనే ప్రాథమిక అర్హతగా ఎంపిక చేయగా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లిలో కుంట అమృత, కల్వలలో గుర్రం మమత, దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామంలో మరో మహిళ ఎంపికయ్యారు. వీరికి పది రోజులపాటు చెన్నైలో, వారం రోజులపాటు హైదరాబాద్‌లో డ్రోన్ నిర్వహణపై 'డ్రోన్ పైలెట్లు'గా శిక్షణనిచ్చారు. డ్రోన్ పైలెట్లకు లైసెన్సుకూడా జారీ చేశారు. డ్రోన్ పైలెట్ లైసెన్సు ఉన్నవారే దీన్ని ఆపరేట్ చేయాలి. లేనట్లయితే డ్రోన్ ద్వారా ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు ఉంటాయి.

ప్రయోగాత్మకంగా అమలు

వ్యవసాయంలో డ్రోన్ ఉపయోగించడం అది కూడా మహిళలతో నిర్వహింపజేయడం ప్రయోగాత్మకంగా చేపట్టారు. వ్యవసాయ పద్ధతులను ఆధునీకీకరించడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి స్వయం సహాయక బృందాల నుంచి డ్రోన్ పైలెట్ల్ కోసం మహిళలను ఎంపిక చేశారు. డ్రోన్ తయారీ కంపెనీలకు స్వయం సహాయక సంఘాల మహిళలకు మధ్యలో లీడ్ ఫర్టిలైజర్ కంపెనీలు(ఎల్‌ఎఫ్‌సీ), క్లస్టర్ లెవల్ ఫెడరేషన్ (సీఎల్‌ఎఫ్)ల ద్వారా ఈ డ్రోన్‌లను అందజేశారు. ఈ డ్రోన్‌లతో పురుగుమందులు, ఎరువులు, కలుపునివారణ మందులను అవసరమైన ప్రాంతంలో కచ్చితంగా పిచికారీ చేసే అవకాశం ఉంటుంది. పొలం, చెల్కల్లో నడుచుకుంటూ పిచికారీ చేయడంవల్ల మొక్కలు ధ్వంసమయ్యే అవకాశం ఉంటుంది. డ్రోన్ ద్వారా పిచికారీతో ఈ సమస్య ఉండదు. ఎకరా విస్తీర్ణానికి సరిపోయే ద్రావకాన్ని ఒకేసారి ట్యాంకులో నింపుకొని కేవలం 8 నుంచి 10 ఎనిమిది నిమిషాల్లోనే పొలం, చేనులో మందును వ్యవసాయ డ్రోన్ పిచికారి చేస్తుంది. ఎకరాకు రూ.400 చొప్పున డ్రోన్ అద్దెను తీసుకుంటున్నారు. నిమిషాల్లోనే పిచికారీ చేస్తుండ డంతో రైతులు డ్రోన్ ద్వారా మందు చల్లించేందు కు ఆసక్తి చూపుతున్నారు. తమ మండలంలోనే కాకుండా పొరుగు మండలాలకు డ్రోన్‌ను అద్దెకు తీసుకువెళ్లి మహిళలు ఉపాధి పొందుతున్నారు. ఈ యూనిట్ల పనితీరును సమీక్షించి విజయవంతమైతే మరిన్ని గ్రామాల్లో మహిళలకు డ్రోన్లను ఇచ్చేందుకు కేంద్రం నిర్ణయించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

డ్రోన్ పైలెట్ అవుతానని ఊహించలేదు..

కుంట అమృత, డ్రోన్ పైలెట్, తాళ్లపూసపల్లి



మా గ్రామంలో త్రివేణి గ్రామైక్య సంఘం కింద రత్నం స్వయం సహాయ సంఘానికి అధ్యక్షురాలిగా పనిచేస్తున్న నేను డిగ్రీ, బీఈడీ పూర్తి చేశా. నమో డ్రోన్ దీదీ పథకానికి నన్ను ఎంపిక చేసి చెన్నై, హైదరాబాద్‌లలో శిక్షణ ఇప్పించి లైసెన్సు కూడా ఇచ్చారు. రైతులు ఇప్పుడిప్పుడే డ్రోన్‌పై అవగాహన ఏర్పడి మందుల పిచికారిలో వాడుతున్నారు. వందశాతం రాయితీతో డ్రోన్ ఇచ్చి ఉపాధి మార్గం కల్పించేందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు.

అర్హులకు మొండిచేయి!

- అనర్హులకు పంటనష్టం డబ్బులు
- ఏవోను నిలదీసిన రైతులు
- ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్


ఏవో వినయ్‌కుమార్‌ను నిలదీస్తున్న రైతులు

నర్సింహులపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నర్సింహులపేట మండలంలో పంటనష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంటనష్ట పరిహారం మంజూరు చేస్తే.. అనర్హులకు డబ్బులు ఇచ్చారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా రైతు వేదికలో ఏవో వినయ్‌కుమార్‌ను కొమ్ములవంచకు చెందిన పలువురు రైతులు మంగళవారం నిలదీయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మండలంలోని 21 గ్రామపంచాయతీలలోని 596 మంది రైతులకు చెందిన 329.18 ఎకరాలల్లో పంట నష్టపోగా ఎకరానికి రూ.10 వేలు చొప్పున రూ.32.96 లక్షలు మంజూరయ్యాయి. ఈ పరిహారం డబ్బులు దశల వారీగా రైతుల ఖాతాలో జమ చేస్తున్నారు.

గ్రామాల వారీగా రైతులు.. ఎకరాలు

అక్కిరాలలో 11 మంది రైతులకు గాను 3.2 ఎకరాలు, బొజ్జన్నపేటలో 47 మందికి 11.24 ఎకరాలు, జయపురంలో 53 మందికి 17.19 ఎకరాలు, కొమ్ములవంచలో 92 మందికి 42.29 ఎకరాలు, కౌసల్యదేవిపల్లిలో 73 మందికి 36.22 ఎకరాలు,ముంగిమడుగులో 168 మందికి 118.23 ఎకరాలు, నర్సింహులపేటలో 99 మందికి 52.35 ఎకరాలు, పెద్దనాగారంలో 31 మందికి 28.37 ఎకరాలు, వంతడుపలలో 23 మంది రైతులకు గాను 17.19 ఎకరాల చొప్పున పంట నష్టం వాటిల్లింది.

- పరిహారం డబ్బులు ఫలహారం?

పంటనష్టం పరిహారం డబ్బులను సంబంధిత అధికారులు ఫలహారం చేశారు. కొమ్ములవంచ, బొజ్జన్నపేట, నర్సింహులపేట, మంగిమడుగు, పెద్ద నాగారం, అక్కిరాల, పడమటిగూడెం, జయపురం గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులకు మొండి చేయి చూపి, పంటనష్టపోని రైతులకు పెద్దపీట వేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కొమ్ములవంచలో తోట సురేష్, పుప్పాల ఉత్తరమ్మ, ఎమ్డీ అమీర్‌పాషా, డొనికని ముత్తమ్మకు ఎక్కువ ఎకరాలల్లో పంట నష్టం జరిగితే.. జాబితాలో వారిపేర్లపై కొంతమేరకే పరిహారం అందినట్లు ఉంది. ఇలా ఆయా గ్రామాల్లో అర్హులకు ప్రాధాన్యత ఇచ్చి, అర్హులకు ఎక్కువ ఎకరాలల్లో పంట నష్టం జరిగితే కొంతమేరకు జరిగినట్లు జాబితాలో నమోదు పరిహారం నిధులను ఫలహారం చేసినట్లు బాధిత రైతులు ఆరోపిస్తు న్నారు. జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పంటనష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

భూగర్భ జలాలను పెంపొందించుకోవాలి

- జిల్లా భూగర్భ జలాల శాఖ అధికారి సురేష్

కొత్తగూడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాలను పెంపొందించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా భూగర్భ జలాల శాఖ అధికారి సురేష్ సూచించారు. కొత్తగూడలో నేషనల్ హైడ్రాలిక్ ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల శాఖ, షేర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయన్నారు. వర్షపు నీటిని నిల్వచేసి భూగర్భ జలాలను పెంచేలా వర్షపు నీటిని నిల్వ చేయాలన్నారు. కాగా భూగర్భ జలాల పరిరక్షణలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, సైన్స్‌ఫేయిర్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ చెన్నకేశవరెడ్డి, ఏపీఎం గుళ్లపల్లి శ్రీనివాస్, వైద్యాధికారి శివ, ఉపాధ్యాయులు రజిత, సాంబయ్య, సుధాకర్, కృష్ణమోహన్, సుబ్బారావు, భూక్య నారాయణ, వనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

'సర్వేను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలి'

మహబూబాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణపై ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే కోసం ప్రణాళికలు తయారు చేసుకుని విజయవంతం చేయాలని సూచించారు. సర్వే నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని వివరించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, జిల్లా అధికారులు నర్మద, హరిప్రసాద్ పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్


జిల్లా సంక్షేమ అధికారి వరలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు ఎక్కడ పనిచేసిన విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తే ప్రజల నుంచి మంచి గుర్తింపు ఉంటుందని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులో ఆర్‌సీ కన్వెన్షన్‌లో మంగళవారం జిల్లా సంక్షేమ అధికారిణి వరలక్ష్మి పదవీవిరమణ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా సంక్షేమ అధికారిగా వరలక్ష్మి పనిచేస్తూ దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేసినట్లు చెప్పారు. విధుల పట్ల నిబద్ధతతో పనిచేస్తే ప్రజల నుంచి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, మాజీ జడ్పీ సీఈవో రమాదేవి, డిప్యూటీ సీఈవో నర్మద, సీడీపీవోలు, జిల్లా అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'దుకాణదారులు జాగ్రత్తలు తీసుకోవాలి'

డోర్నకల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాదారులు అప్రమత్తంగా ఉండాలని డోర్నకల్ అగ్నిమాపక శాఖ అధికారి వీరేష్ మంగళవారం షాపు యాజమానులకు సూచించారు. డోర్నకల్‌లో ఏర్పాటు చేసిన దుకాణాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసిన చోట డ్రమ్ముల్లో నీరు నింపి ఉంచుకోవాలని, బకెట్లలో ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. షాపు యాజమానులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

ఏఐసీటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుల నియామకం


మొగిళి, బిచ్యానాయక్

కేసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎంసీపీఐ అనుబంధ అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం (ఏఐసీటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యులుగా కేసముద్రానికి చెందిన మర్రిపెల్లి మొగిళి, జాటోత్ బిచ్యానాయక్‌లను నియమించినట్లు వారు తెలిపారు. కేసముద్రంలో మంగళవారం వారు మాట్లాడుతూ ఈనెల 28, 29 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించిన సంఘం రాష్ట్ర మహాసభలో తమను రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పానుగంటి నర్సయ్య, నర్ల చంద్రశేఖర్‌లు నియమించారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

ఇనుగుర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకుడు కన్నంత రెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పత్తి రైతులకు ప్రభుత్వ మద్దతు ధర కల్పించేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.మౌలానా, హుస్సేన్, గుగులోత్ శంకర్, రమేష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన ప్రభుత్వవిప్

మరిపెడ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్ సమావేశాలలోపే మరిపెడ ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ, మోడల్ మార్కెట్‌ను అకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మరిపెడ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి సౌకర్యాలు, వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. అనంతరం మోడల్ మార్కెట్ పనులను పరిశీ లించి కాంట్రాక్టర్, ఇంజినీర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మరిపెడ గొస్ట్ దగ్గర ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మునిసిపల్ ఇంజినీర్లు, మిషన్‌భగీరథ ఇంజినీర్లు, వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, అఫ్జల్, గుగులోత్ రవి, గంగయ్య ఉన్నారు.

నేటి తరం నేతలకు వెంకట్‌రెడ్డి స్ఫూర్తి : ఎమ్మెల్యే

సీరోలు : స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్సీ వెడవెల్లి వెంకట్‌రెడ్డి జీవితం నేటి తరం రాజకీయనేతలకు స్ఫూర్తిదాయకమని డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వవిప్ జాటోతు రాంచందర్‌నాయక్ అన్నారు. వెంకటరెడ్డి 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా మంగళవారం సీరోలు మండల కేంద్రంలోని వెంకట్‌రెడ్డి నివాసంలో కుటుంబసభ్యులు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వవిప్ రాచందర్‌నాయక్ వెంకట్‌రెడ్డితో కేక్‌కట్ చేయించి సత్కరించారు. ఈ సందర్భంగా రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ కొందరు నాయకులకు పదవులతోనే గుర్తింపు వస్తుందని కానీ వెంకటరెడ్డి విషయంలో మాత్రం ఆయన వల్ల పదవులకే గుర్తింపు వచ్చిందని, నిత్యం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన కృషిచేశారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి కుమారులు, కోడళ్లు, కుటుంబసభ్యులు వెడవెల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, మంజుల, హర్షవర్ధన్‌రెడి, దీపిక, రాజవర్ధన్‌రెడ్డి, సురేఖ, కుమార్తె రాజశ్రీ, నాయకులు బండి వెంకట్‌రెడ్డి, నున్న రమణ పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్సీ వెడవెల్లి వెంకట్‌రెడ్డిని సత్కరిస్తున్న రాంచందర్ నాయక్

'ఉపాధి హామీ'లో అక్రమాలు

- రూ.17, 80,195 రికవరీకి అడిషనల్ డీఆర్‌డీవో శాంతకుమారి ఆదేశాలు

కొత్తగూడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాల్లో రికవరీల రికార్డు మోతమోగింది. గత రెండురోజులుగా నిర్వహించిన 14వ సామాజిక తనిఖీలో ఆ బృందం అక్రమాలను గుర్తించగా, అడిషనల్ డీఆర్‌డీవో శాంతకుమారి రికవరీలు భారీగా విధించారు. మొత్తం రూ.17,80,195 రికవరీగా చేయాలని ఆదేశించగా ఇందులో అత్యధికంగా వేలుబెల్లిలో రూ. 2,97,212, అత్యల్పంగా సాధిరెడ్డిపల్లిలో రూ. 6,742 రికవరీ చేయాలని శాంతకుమారి ఆదేశించారు.

గ్రామ పంచాయతీల వారీగా ఇలా..

ముస్మి రూ.75,075, పెగడపల్లి రూ, 1,49,353, కార్లాయి రూ. 57, 282, గోవిందాపురం రూ. 28,215, ఓటాయి రూ. 11,263, మొండ్రాయిగూడెం రూ.32,168, దుర్గారం రూ.18,488, ఎదుళ్లపల్లి రూ. 1,40,852, ఎంచగూడెం రూ.69,704, రామన్నగూడెం తండా రూ. 11,637, బత్తులపల్లి రూ. 7,275, తాటివారివేంపల్లి రూ. 1,77,106, గుంజేడు రూ. 28,158, సాధిరెడ్డిపలి రూ. 6,742, చెరువుముందు తండా రూ.20,279, రేణ్యాతండా రూ. 65,955, కోనాపురం రూ. 50,282, వేలుబెల్లి రూ. 2,97,212, గోపాలపురం రూ. 47,056, జంగవానిగూడెం రూ. 11,965, పొగుళ్లపల్లి రూ. 12,449, కొత్తపల్లి రూ. 1,55,123, గుండం రూ. 17,514, కొత్తగూడ రూ. 2,89,042 రికవరి చేయాలని ఆదేశించారు. కాగా, వారంలోగా మొక్కలు నాటాలని, పలు అక్రమాలపై విచారణ చేయాలని అడిషనల్ డీఆర్‌డీవో ఆదేశించారు. మొక్కలు నాటకపోయినా, విచారణలో అక్రమాలు బయటపడితే రికవరీ మరింతగా పెరిగే అవకాశం ఉంది.

అథ్లెటిక్స్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్, కేసముద్రంలలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జి. ఉపేందర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని హారిక బాలికల అండర్-19 విభాగం 3000 మీటర పరుగుపందెంలో ప్రథమ స్థానం, అండర్-19 బాలుర విభాగంప్రథమ సంవత్సరం విద్యార్థి సతీష్ 3000 మీటర్ల పరుగుపందెంలోప్రథమ స్థానంలో నిలిచి సరూర్‌నగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అండర్-14 విభాగం బాస్కెట్ బాల్ పోటీల్లో రామ్‌దీక్షిత్ ఉత్తమ ప్రతిబ కనబరిచి కేసముద్రంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు రాష్ట్రాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పీడీ సింధువర్మ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.


అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుండెపోటుతో వాచ్‌మెన్ మృతి

డోర్నకల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం చిల్కోడులోని మోడల్ స్కూల్లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బద్దూరి వెంకన్న (46) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. చిల్కోడులో నివాసముంటున్న బద్దూరి వెంకన్న మోడల్‌స్కూల్లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారంఉదయం ఇంటి నుంచి తన కుమార్తెను తీసుకుని వచ్చి స్కూల్ వద్ద దింపాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఛాతిలో నొప్పి రావడంతో తన ద్విచక్ర వాహనం ఆపి పక్కనే ఉన్న కల్వర్టుపై కూర్చున్నాడు. నొప్పి అధికం కావడంతో కల్వర్టుపై నుంచి కిందపడ్డాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే అతన్ని కల్వర్టుపై నుంచి పైకి లేపి 108కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది వెంకన్నను పరిశీలించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నేత్రవైద్య శిబిరం

తొర్రూరు రూరల్, అక్టోబరు 29 : చెర్లపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహేష్ ఆప్టికల్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం తనూజ మాట్లాడుతూ ప్రస్తుతం సెల్‌ఫోన్ల వినియోగంతో కంటి సమస్యలతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా 120 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కంటి సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న 10 మంది విద్యార్థులకు ఉచితంగా అద్దాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నైత్రవైద్య సహాయకుడు పులుగుజ్జ మహేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకెళ్లాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్


చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను అవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ జీవన్

మరిపెడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకెళ్లాలని మరిపెడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ అన్నారు. మంగళవారం మరిపెడ హైస్కూల్‌లో మండలస్థాయి చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను జనవిజ్ఞాన వేదిక బాధ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నవంబరు 7న పాఠశాలల స్థాయి, 21మండల స్థాయి, 28 జిల్లాస్థాయి, డిసెంబరు 14నుంచి 16వరకు రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయని జనవిజ్ఞాన వేదిక మరిపెడ మండల అధ్యక్షుడు బి.రాంమోహన్ తెలిపారు. దయానంద్, నవీన్, డాక్టర్ సురేందర్‌రెడ్డి, వీరస్వామి, జనార్ధనాచారి, రాజకుమారి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆగస్టు నెలలో అకాల వర్షంతో వరద ఉధృతికి కొట్టుకుపోయి చెరువు కట్టకు మరమ్మతు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సురుగు ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మండలం వీఎస్.లక్ష్మీపురంలో మంగళవారం తెగిన చెరువు కట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగస్టు నెలలో వచ్చిన భారీ వర్షాలకు చెరువుకు నీరుపొటెత్తి కట్ట తెగిపోయిందన్నారు. కట్టకు మరమ్మతులు చేస్తే గానీ యాసంగి పంటకు నీరందే అవకాశం లేదన్నారు. వెంటనే అధికారులు చెరువుకు మరమ్మతులుచేపట్టాలని కోరారు. శ్రీను, ఎల్లయ్య, హరీష్, సిద్దార్థ పాల్గొన్నారు.

ఐఎంఏ జోన్-3 సహాయ కార్యదర్శి రూప్‌లాల్‌కు సన్మానం


రూప్‌లాల్‌ను సన్మానిస్తున్న ఐఎంఏ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హైదరాబాద్ జోన్-3 సహాయ కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ రూప్‌లాల్‌ను మానుకోటలో సన్మానించారు. ఈనెల 27 హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర ఎన్నికల్లో భాగంగా ఐఎంఏ హైదరాబాద్ జోన్-3 సహాయ కార్యదర్శిగా మహబూబాబాద్‌కు చెందిన రూప్‌లాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన్ను ఐఎంఏ మానుకోట శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఐఎంఏ మానుకోట శాఖ అధ్యక్షుడు డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్ మాట్లాడుతూ అన్నిరంగాల్లో కెల్లా వైద్యరంగానికి ఎంతో ప్రాధాన్యత ఉందని చెప్పారు. ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ ఎస్.సురేందర్, కోశాధికారి డాక్టర్ టి.వైదేహి, వైద్యులు బి.వెంకట్రాములు, దేవిరెడ్డి, ప్రమోద్‌రెడ్డి,ఇంద్రసేనారెడ్డి,సూర్యకుమారి, సునిత, కుమారస్వామి, తల్లాడ సతీష్, గుగులోతు బాలునాయక్, డోలి సాయికిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని చదువుకోవాలి

తొర్రూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని విద్యనభ్యసించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తొర్రూరులోని కళాశాల ఆవరణలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. కళాశాల ఆవరణంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ఎన్.సీ.సీ. ఇన్‌చార్జి నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయ వైద్యానికి ఆదరణ

తొర్రూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ వైద్యానికి ఆధరణ లభిస్తుందని అయుర్వేద వైద్యుడు పి.కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం తొర్రూరులోని ఆయు ర్వేద ఆసుపత్రిలో ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు రమేష్, జ్వలిత, మిరాజ్, ప్రియాంక, ఫార్మసిస్టు మహేష్, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవం


డ్రైవర్ నర్సయ్యకు ప్రగతి చక్ర అవార్డు ప్రశాంసా పత్రాన్ని అందిస్తున్న డీఎం

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఆర్టీసీ డిపో లో మంగళవారం ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు, ప్రశాం సా పత్రాలను అందించారు. బెస్ట్ కేఎంపీఎల్ విభాగం, బెస్ట్ ఈపీకే విభాగం, బెస్ట్ అటెండెన్స్ విభాగాల్లో అత్యంత ప్రతిభ కనపర్చిన డ్రైవర్లు, కండక్టర్లు మెకానిక్‌లకు డీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో అవార్డులు అందించారు. ఏప్రిల్ 2024 నుంచి సెప్టెంబరు 2024 వరకు విధుల్లో అత్యంత ప్రతిభ కనపర్చిన ప్రగతి చక్ర అవార్డులు, ప్రశాంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు జి. శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, రాఘవేంద్ర, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్‌ను కలిసిన డోలి



ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సత్యనారాయణ

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్, ప్రొఫెసర్ పురుషోత్తంను మంగళవారం మానుకోట నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా నియామకమైన పురుషోత్తంను పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఉన్నత విద్య గూర్చి చర్చించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాభ్యున్నతికి కృషి చేయాలని కోరినట్లు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు ఆరుద్ర పరమాత్మచారి పాల్గొన్నారు.

'సబ్సిడీ రుణాలను విడుదల చేయాలి'


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న తెలంగాణ గిరిజన సమాఖ్య నేతలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లోఉన్న రూ.265 కోట్ల ట్రైకార్ సబ్సిడీ రుణాలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షుడు లింగ్యానాయక్, ప్రధానకార్యదర్శి మాలోతు రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మానుకోటలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ సబ్సిడీరుణాలను విడుదల చేయకపోవడంతో గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరావత్ నరేష్ పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తా'

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తనను ఆదుకుని సహకరిస్తే తనలో శ్వాస ఉన్నంత వరకు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తానని ప్రజా హృదయం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, వనప్రేమికుడు, హరితమిత్రఅవార్డు గ్రహీత దైద వెంకన్న కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోప్రభుత్వ, ముఖ్యమంత్రి సలహాదారులు వేం.నరేందర్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దైద వెంకన్న మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా మొక్కలు నాటుతూ వాటిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్నానని చెప్పారు. మూఢ నమ్మకాల నిర్మూలన, భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడు గుంతల ఏర్పాటు, ప్లాస్టిక్‌కవర్ల నిషేధంపై ప్రచారం చేస్తూ ప్రజలను, విద్యార్థులను చైతన్యపరుస్తూ కార్యక్రమాలు నిర్వహించాన్నారు. తనను ఆదుకుంటే మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతానని వివరించారు.

సామ్రాజ్యవాద, నిర్బంధ ఆంక్షలు ఎత్తి వేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : క్యూబా దేశంపై అమెరికాసామ్రాజ్యవాద నిరంకుశ, నిర్బంధ ఆంక్షలు ఎత్తివేయాలని, అమెరికా ఆధిపత్యాన్ని ఎండగడుతూ ప్రతిఒక్కరు క్యూబాకు మద్దతుగా నిలవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. క్యూబాపై అమెరికా ఆంక్షలను వ్యతిరేకిస్తూ మహబూబాబాద్ వ్యవసాయమార్కెట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ క్యూబాపై అనేక సంవత్సరాలుగా అమెరికా ఆంక్షలు విధిస్తూ ఆర్థిక, వాణిజ్యరంగాలను దెబ్బతీస్తుందని చెప్పారు. దీంతో అక్కడి ప్రజానీకం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, కుమ్మరికుంట్ల నాగన్న, సమ్మెట రాజమౌళి, కందునూరు శ్రీనివాస్, తోట శ్రీనివాస్, బాలు, నాగమ్మ, లచ్చు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందంజ

కురవి, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్‌యూటీఎఫ్ ముందంజలో ఉందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ అన్నారు. కురవి మండలం తట్టుపల్లి సహా ఇతర పాఠశాలల్లో మంగళవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ.. హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా భావించి యూటీఎఫ్ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నిఅమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎం.ప్రవీణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి మంజుల, ఆడిట్ కమిటీ కన్వీనర్ బాబు పాల్గొన్నారు.

కేసముద్రం విలేజీలో నరకాసుర వధ

కేసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజి శ్రీ వివేకవర్థిని హైస్కూల్లో మంగళవారం దీపావళి పండుగను పురస్కరించుకొని నరకాసుర వధ నిర్వహించారు. కృష్ణుడు, సత్యభామ వేషధారణలో ఉన్న విద్యార్థినులు బాణాన్ని సంధించి నరకాసురుని బొమ్మను టపాసులతో పేల్చివేశారు. అనంతరం కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ కోలాను తప్పి బాణాసంచాను కాల్చారు. విద్యార్థులకు సాంప్రదాయాలను తెలియజేసేందుకు దీపావళి పండుగను నిర్వహించినట్లు కరస్పాండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిర్ర నరేష్, గడ్డమీది నరేష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విలేజి వివేకవర్థినీ హైస్కూల్లో నరకాసుర వధను నిర్వహిస్తున్న కృష్ణుడు, సత్యభామ వేషధారణలో విద్యార్థినులు